క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సమావేశం

నాగాయలంక: స్థానిక మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం శుక్రవారం జరుగుతుందని ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపీపీ భోగాది రాఘవరాణి అధ్యక్షతన జరిగే సమావేశంలో 21 శాఖల పనితీరుపై సమీక్ష జరుగుతుందన్నారు. ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు విధిగా హాజరు కావాలని కోరారు.

27 నుంచి కుల గణన సర్వే

మోపిదేవి: కుల గణన సర్వే కార్యక్రమం ఈనెల 27 నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో చేపట్టాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి, గ్రామ సచివాలయ అధికారుల సమావేశం గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అత్యంత సులభంగా ఈ ప్రక్రియను నిర్వహించేలా కుల గణన యాప్‌లో మార్పులు, చేర్పులు చేశారని చెప్పారు. యాప్‌లో సర్వే కోసం అన్ని రకాల ప్రశ్నలను చేర్చాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రతి కుటుంబంలో ఒకరికి ఈ-కేవైసీ నమోదుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఫేషియల్, వేలిముద్రలు, ఐరిస్, ఓటీపీ విధానాల ద్వారా ఈ-కేవైసీ నమోదుకు అవకాశం కల్పించామని వివరించారు. తహసీల్దార్ కె. నవీన్‌కుమార్, ఈఓపీఆర్డీ, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గ్రామ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పాల కావడిలతో స్వామివారి దర్శనం



మోపిదేవి: మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని అయ్యప్ప స్వాములు పాల కావడిలతో దర్శించుకున్నారు. ఆర్టీసీ శ్రీను గురుస్వామి ఆధ్వర్యంలో 70 మంది అయ్యప్ప మాలధారులు పాల కావడిలతో గురువారం ఉదయం నాగాయలంక నుంచి మోపిదేవి చేరుకున్నారు. స్వామివారికి పంచామృతాలతో పూజలు చేశారు.

పాల కేంద్రం నూతన భవనానికి శంకుస్థాపన

పెడన: పాల ఉత్పత్తిదారుల అభ్యున్నతికి కృష్ణా మిల్క్ యూనియన్ కృషి చేస్తోందని యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. గురువారం మండలంలోని ఉరివి గ్రామంలో ఉరివి పాల ఉత్పత్తిదారుల సంక్షేమ సంఘ పాల కేంద్రం నూతన భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. పాల ఉత్పత్తిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఆయన మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారులకు మేలైన యాజమాన్య పద్ధతులు, మెరుగైన పశుపోషణకు సంబంధించి పలు సూచనలు చేశారు. యూనియన్ పాడి రైతులకు అందిస్తున్న సేవలు వివరించారు. గుడ్లవల్లేరు పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ, అసోసియేషన్ అధ్యక్షుడు దొండపాటి సూర్యనారాయణ, సూపర్‌వైజర్ చొప్పకట్ల వరప్రసాద్, కార్యదర్శి నాగరాజు, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సంబంధాల అధికారిగా శ్రావణి

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సంబంధాల అధికారిగా మేనేజ్‌మెంట్ విభాగం సహాయ ఆచార్యులు డాక్టర్ ఎం. శ్రావణి నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య జి. జ్ఞానమణి ఉత్తర్వులు జారీ చేశారు. విశ్వవిద్యాలయంలో చదువు పూర్తి చేసుకుని వివిధ స్థాయిల్లో దేశ, విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థుల వివరాలు సేకరించి వారి తోడ్పాటును విశ్వవిద్యాలయానికి అందించేలా విధులు నిర్వర్తించాలని జ్ఞానమణి జారీ చేసిన ఉత్తర్వులో పేర్కొన్నారు.

జంట నాగుల విగ్రహ ప్రతిష్ఠ

గూడూరు: రాయవరంలో ప్రసిద్ధి చెందిన భ్రమరాంబ సమేత దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో జంట నాగుల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. పీఏసీఎస్ చైర్మన్ కోళ్ల వీర వెంకట బాలకృష్ణ, వైఎస్సార్ సీపీ గూడూరు మండల ఉపాధ్యక్షుడు కోళ్ల నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

కోనేరుసెంటర్: బందరు మండలం రుద్రవరంలోని అంబేడ్కర్ గురుకులాన్ని చిన్నాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పావని వైద్య సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె గురుకులంలోని 431 మంది విద్యార్థులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. డాక్టర్ పావని మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్య సూత్రాలను పాటించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఎలాంటి వ్యాధులు దరిచేరవని చెప్పారు. దోమల వలనే అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. వాటి నుంచి రక్షణ కల్పించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఎల్ హెచ్ పి. అమ్మాజీ, ఆశాలు ధర్మజ్యోతి, శాంతి, బాబా, రాంబాబు, పీవీ పరమేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ విప్లవం

- పేర్ని కిట్టు
- ఉత్సాహంగా 'ఏపీకి జగనన్నే ఎందుకు కావాలి'
- సంక్షేమ బోర్డుల ఆవిష్కరణ



బందరులో మాట్లాడుతున్న పేర్ని కిట్టు. చిత్రంలో మేయర్ వెంకటేశ్వరమ్మ



నందమూరులో బోర్డు ఆవిష్కరించిన నాయకులు



నాగాయితిప్పలో జెండాను ఆవిష్కరించిన నాయకులు



నీలిపూడిలో సంక్షేమ బోర్డు ఆవిష్కరణ

మచిలీపట్నంటౌన్: వైఎస్ జగన్‌మోహన్ ప్రభుత్వం రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తోందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం గురువారం 14, 16 డివిజన్లలో నిర్వహించారు. ఆయా డివిజన్లలో పార్టీ జెండాలను, సంక్షేమ బోర్డులను ఆవిష్కరించారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను ఆదుకునేలా సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని నమ్మిన సీఎం జగన్ విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. వైద్య రంగం అభివృద్ధి ఫలం మచిలీపట్నానికి కూడా దక్కిందన్నారు. సీఎం జగన్, ఎమ్మెల్యే పేర్ని నాని ప్రత్యేక చొరవతో రూ. 550 కోట్లతో మెడికల్ కళాశాల పూర్తయిందన్నారు. అలాగే పోర్టు, ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ మాట్లాడారు. కార్యక్రమంలో 14వ డివిజన్ కార్పొరేటర్ కాగిత జవహర్‌లాల్, వైఎస్సార్ సీపీ 16వ డివిజన్ ఇన్‌చార్జి భోగిరెడ్డి వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్లు గూడవల్లి నాగరాజు, మొహమ్మద్ రఫీ, డెప్యూటీ మేయర్ శీలం భారతి పాల్గొన్నారు.

ఏటిమొగ (నాగాయలంక): మండలంలోని తీర గ్రామం ఏటిమొగ సచివాలయం పరిధిలో గురువారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి, పల్లెకుపోదాం కార్యక్రమాలు జరిగాయి. జెడ్పీటీసీ మోకా బుచ్చిబాబు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నారి, డీసీఎంఎస్ డైరెక్టర్ రేమాల సుబ్బారావు (బెనర్జీ), వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు మాట్లాడుతూ సచివాలయం పరిధిలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్, సర్పంచి నాయుడు ఉమాదేవి, ఎంపీటీసీ విశ్వనాథపల్లి నాగలక్ష్మి, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు తమ్ము సోమేశ్వరరావు, తోట సాయిబాబు, నాయకులు పాల్గొన్నారు.

- నాగాయితిప్ప(మోపిదేవి): పేదరిక నిర్మూలనకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. పెదప్రోలు గ్రామ సచివాలయం వద్ద పల్లెకు పోదాం, ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం గురువారం సాయంత్రం నిర్వహించారు. సంక్షేమ బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని చెప్పారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించారు. పేదల బాధలు, కష్టాలు తెలిసిన సీఎం జగన్‌ను మరోసారి దీవించాలని కోరారు. నోడల్ అధికారి విద్యాసాగర్, మండల సచివాలయ కన్వీనర్ కోసూరు శివనాగమల్లేశ్వరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు గరికిపాటి గోవిందరాజులు, ఆది రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు సనకా వెంకట రాజేష్ బాబు, లింగం జగదీష్ కుమార్, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు, గ్రామ పార్టీ కన్వీనర్ సతీష్‌బాబు పాల్గొన్నారు.
- పెడన: మండలంలోని నందమూరు గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం గురువారం నిర్వహించారు. భాగంగా పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డును, వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు గరికపాటి వెంకటరామానాయుడు, కొండవీటి నాగబాబు మాట్లాడారు. పలువురు గ్రామసులు సీఎం జగనే మళ్లీ రావాలని, కావాలని, ఆయన సీఎంగా ఉంటేనే మాకు సంక్షేమ ఫలాలు అందుతాయని లబ్ధిదారులు పేర్కొవడంతో పార్టీ నాయకులు మరింత ఉత్సాహంగా గడపగడపకు తిరిగారు. ఈ కార్యక్రమంలో నందమూరు పీఏసీఎస్ అధ్యక్షుడు తాతా ఉమామహేశ్వరరావు, లోయ అంజనేయులు, పామర్తి సాంబశివరావు, ఎంపీటీసీ బొల్లా ఉదయభాస్కర్, సర్పంచు పరసా నరసింహారావు, ఎంపీడీవో రెడ్డయ్య, గృహ సారథులు, వాలంటీర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.
- కృత్తివెన్ను: మండలంలోని నీలిపూడి సచివాలయం పరిధిలో పల్లెకు పోదాం కార్యక్రమం జరిగింది. సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ జెండాను నాయకులు ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో రాష్ట్రాభివృద్ధికి, సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషిని ప్రజలకు వివరించారు. మరిన్ని సంక్షేమ పథకాలు కావాలంటే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రిగా రావాలని కోరారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వై. వెంకట్రాజు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి కె. బాపూజీ, సర్పంచ్ పాశం కృష్ణ, కృత్తివెన్ను పీఏసీఎస్ చైర్మన్ కె.లక్ష్మోజీ, నాయకులు బుద్దన శివ, పుప్పాల గంగరాజు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.
- గూడూరు: గూడూరు మండలం తరకటూరు సచివాలయం పరిధిలో గురువారం ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును, గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధుసూదన రావు, జెడ్పీటీసీ సభ్యుడు వేమలు సురేష్ రంగ బాబు, కేడీసీసీబీ డైరెక్టర్ తలుపుల వెంకట కృష్ణారావు, ఎంపీటీసీ సభ్యుడు జక్కా ధర్మారాయుడు, వైఎస్సార్ సీపీ గూడూరు మండల అధ్యక్షుడు పర్నం పెదబాబు, సర్పంచి చిన్నం వెంకట రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.
- నిమ్మగడ్డ(చల్లపల్లి): పురిటిగడ్డ శివారు నిమ్మగడ్డలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ రాజులపాటి కల్యాణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శీరం వెంకట సత్యన్నారాయణ, సర్పంచ్ మాతంగి రమ్య పాల్గొన్నారు.


వైభవంగా వీరాంజనేయ స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ



స్వామివారిని దర్శించుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ హారిక, రాము దంపతులు

పెడన: కవిపురం గ్రామంలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో వీరాంజనేయ స్వామి వారి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా రెండు రోజులుగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. మూడో రోజు గురువారం ఉదయం వీరాంజనేయస్వామి వారి ఆలయంలో వీరాంజనేయస్వామి విగ్రహాన్ని వేద పండితులు గూడూరు రామకృష్ణ శర్మ వేదమంత్రాల నడుమ పునఃప్రతిష్ఠింపజేశారు. వైదిక కార్యక్రమాలు జరిగాయి. కటకం శ్రీరాములు, వీర కళావతిలు, పుప్పాల మాధవరావు, వీరరాఘవమ్మ దంపతులతో వేదపండితులు బ్రహ్మశ్రీ గూడూరు రామకృష్ణశర్మ హోమాలు, ప్రత్యేక పూజలు చేయించారు. ఉదయం 10.57 గంటలకు వేద పండితుల వేద మంత్రోచ్ఛరణ నడుమ విగ్రహ పునఃప్రతిష్ఠ జరిగింది. స్వామివారిని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, రాము దంపతులతో పాటు పెడన ఎంపీపీ రాజులపాటి వాణి, వైఎస్సార్ సీపీ నాయకులు రాజులపాటి అచ్యుతరావు, కొండవీటి నాగబాబు, గరికపాటి వెంకట రామానాయుడు, దావు బైరవలింగం తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధనలో స్థానిక భక్తులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన వారు స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను పురస్కరించుకుని గ్రామంలో మహిళల కోలాట ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. రాత్రికి కోటి దిపోత్సవం కార్యక్రమాన్ని మహిళలు, బాలికలు, చిన్నారులు నిర్వహించారు. కవిపురం పీఏసీఎస్ అధ్యక్షుడు తిక్కిశెట్టి వెంకట సీతారామ ప్రసాద్ బాబు, కవిపురం భక్తబృందం ఆధ్వర్యంలో ఆయా కార్యక్రమాలను నిర్వహించారు.

ఆలయాల్లో కార్తిక దీప కాంతులు



కన్యకాంబ ఆలయంలో నగరేశ్వరునికి అలంకరణ



శ్రీరామపాదక్షేత్రంలో కార్తిక దీపాలతో మహిళలు

భావదేవరపల్లి(నాగాయలంక): కార్తిక ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పలు దేవాలయాల్లో విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు, దీపాలంకరణ కార్యక్రమాలు గురువారం రాత్రి కోలాహలంగా జరిగాయి. భావదేవరపల్లి అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో గ్రామ భక్త బృందం ఆధ్వర్యంలో మహిళలు ప్రమిదల్లో ఆవునెయ్యి పోసి ఓంకారం, శివలింగం, స్వస్తిక్ ఆకృతుల్లో కార్తిక దీపాలు వెలిగించారు. ఆలయ అర్చకుడు శ్రీహరి బ్రహ్మత్వంలో అమ్మవారికి కుంకుమార్చన, కాశీవిశ్వేశ్వరస్వామి, వినాయకుడికి ప్రత్యేక పూజలు జరిపారు. నాగాయలంక కృష్ణాతీరంలోని శ్రీరామపాదక్షేత్రం పుష్కరఘాట్‌లో రామలింగేశ్వర స్వామి సన్నిధిలో మహిళలు కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేశారు. బ్రహ్మశ్రీ అంబా సాయికిరణ్ శర్మ నేతృత్వంలో భక్తులచే కార్తిక దీపాలంకరణ, కోటివత్తుల ప్రజ్వలన, నవ హారతులు కార్యక్రమాలు జరిగాయి. నాగాయలంకలోని పార్వతీ సమేత కన్యకా పరమేశ్వరి సమనిత నగరేశ్వరస్వామి ఆలయంలో కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు ఆధ్వర్యంలో కొల్లిపర సుబ్బారావు బ్రహ్మత్వంలో స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు.

సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న పేర్ని కిట్టు. చిత్రంలో మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: నగరంలోని 26వ డివిజన్ మినర్వా థియేటర్ వీధిలో సిమెంటు రోడ్డు, పక్కా డ్రెయిన్ నిర్మాణ పనులను వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మతో కలిసి ప్రారంభించారు. మినర్వా థియేటర్ వీధిలో ఈ పనులను ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ. 20 లక్షలతో సీసీ రోడ్డు, 15వ ఆర్థిక సంఘం నిధులతో పక్కా డ్రెయిన్ నిర్మాణ పనులను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ నగరంలోని రహదారుల అభివృద్ధికి ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) చొరవతో నిధులు మంజూరు చేస్తున్నారని, ఆ నిధులతో పనులు చేపడుతున్నామని చెప్పారు. డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, డెప్యూటీ మేయర్ శీలం భారతి, కార్పొరేటర్లు షేక్ ముంతాజ్‌బేగం, రాసంశెట్టి వాణి శ్రీ, తాతారావు, కో-ఆప్షన్ సభ్యులు బేతపూడి రవి, మట్టా తులసి, మాజీ కౌన్సిలర్ మాడపాటి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం నగర అధ్యక్షుడు షేక్ జలీల్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



తేమ శాతం పరికరాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మధుసూదనరావు

పెడన: మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ పి. మధుసూదనరావు, ఏఓ జీవీ శ్రీనివాసరావు పరిశీలించారు. గురువిందగుంట ఆర్‌బీకేలో ఏర్పాటు చేసిన పీపీసీని తహసీల్దార్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తేమ శాతం కొలిచే పరికరం పనితీరును పరిశీలించి సిబ్బంది నుంచి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. గోనె సంచులు బాగున్నాయా లేదా చూశారు. రంధ్రాలున్న గోనె సంచులు వస్తే పరిశీలించి తిప్పి పంపించాలని సూచించారు. రైతులు మరో వారం రోజుల్లో కోతలు ప్రారంభించి ధాన్యం తీసుకువస్తారని పీపీసీ సిబ్బంది తహసీల్దార్‌కు తెలిపారు. అనంతరం ఏఓ కమలాపురంలోని పీపీసీ (ప్యాడీ పర్చేజింగ్ సెంటర్)ను పరిశీలించి సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

హిందూ కళాశాలలో సీఎంఏ ఫౌండేషన్ కోర్సు ప్రారంభం


మచిలీపట్నంటౌన్: హిందూ జూనియర్ కళాశాలలో నూతనంగా ప్రారంభిస్తున్న కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్ (సీఎంఏ) ఫౌండేషన్ కోర్సును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హిందూ విద్యా సంస్థల అధ్యక్షుడు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు అన్నారు. కళాశాలలో గురువారం జరిగిన ఫౌండేషన్ కోర్సు ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటర్ చదువుతూనే ఈ ఫౌండేషన్ కోర్సు చేయడంతో పలు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని వివరించారు. విద్యా సంస్థల సెక్రటరీ దైతా గోపాలకృష్ణశాస్త్రి మాట్లాడుతూ ఈ కోర్సు చేయటం వల్ల అన్ని విధాలుగా విద్యార్థులకు అవగాహన పెరుగుతుందన్నారు. ఇంటర్ నుంచి డిగ్రీ వరకు సాయంత్రం వేళల్లో ఈ కోర్సు బోధన జరుగుతుందని చెప్పారు. విద్యాసంస్థల డైరెక్టర్ డీపీఎస్‌వీ ప్రసాద్, ప్రొఫెసర్ భారతి, హిందూ విద్యా సంస్థల కళాశాలల ప్రిన్సిపాల్స్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధి ప్రణాళికలపై నివేదికలు ఇవ్వాలి

పెడన: పాఠశాలల ఆవాస ప్రాంతాలు, సముదాయాల అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేసి పంపించాలని ఎంఈఓ-1 దుర్గాప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని ప్రధానోపాధ్యాయులతో పాఠశాలల అభివృద్ధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన వసతులు, విద్యార్థుల నిష్పత్తి ఆధారంగా ఉపాధ్యాయుల సర్దుబాటు ఉంటుందన్నారు. ఉపాధ్యాయుల శిక్షణ, ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు అవసరం కానున్న ఉపకరణాలు, విద్యా కానుక కిట్లు, పాఠశాలలకు అవసరం కానున్న నిధులు తదితర వాటి ప్రణాళికలు రూపొందించి తీర్మానించి నివేదికలను ప్రభుత్వానికి పంపించాల్సి ఉంటుందన్నారు. ప్రధానోపాధ్యాయులు ప్రణాళిక రచనలో ఖచ్చితత్వం పాటించాలన్నారు.

ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్న సమ్మెటివ్-1 పరీక్షల నిర్వహణ, నాడు-నేడు అభివృద్ధి పనులు, ఉపాధ్యాయుల-విద్యార్థుల హాజరు, రికార్డ్-రిజిస్టర్‌ల నిర్వహణ, జగనన్న గోరుముద్ద తదితర అంశాలపై పాఠశాలల వారీగా ప్రధానోపాధ్యాయులతో సమీక్షించారు. ఎంఈఓ-2 హరనాథ్, రిసోర్స్‌పర్సన్ సత్యనారాయణ, హెచ్‌ఎం ఉష పాల్గొన్నారు.

పాశ్చాపురంలో మార్మోగిన వేదఘోష



బంటుమిల్లి: పాశ్చాపురం గ్రామంలోని సువర్చల ఆంజనేయస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పాశ్చాపురం గ్రామంలో పండితుల వేదఘోష మార్మోగింది. వార్షిక ఉత్సవాల్లో భాగంగా గురువారం రెండో రోజు ఉదయం పండితులు రొంపిచర్ల హనుమంతాచార్యులు, పరాశరం రంగనాథాచార్యులు శిష్య బృందం వేద మంత్రాల మధ్య విష్వక్సేన పూజ, పుణ్యాహవచనము, అగ్నిమదనం తదితర కార్యక్రమాలతో వాస్తుహోమం అనంతరం హనుమత్ సుదర్శన సమేత నారసింహయజ్ఞం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి సామూహిక మహాలక్ష్మి ఆరాధన, విశేష పూజలు, తదితర హోమాలు జరిగాయి. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తుల గోవిందనామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మికత పెంపొందాలి

బాల బ్రహ్మానంద సరస్వతి

మోపిదేవి: ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మికత పెంపొందాలని నైమిషారణ్య పీఠాధిపతి బాల బ్రహ్మానంద సరస్వతి అన్నారు.

మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో గురువారం ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీజీ రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ ప్రోత్సాహంతో రాష్ట్ర వ్యాప్తంగా 300 దేవాలయాల్లో దేవతా విజ్ఞానం, దేవాలయాల ప్రాముఖ్యతను వివరిస్తూ చైతన్యం కల్పించేందుకు ధర్మ పరిరక్షణే లక్ష్యంగా ఈ యాత్ర చేపట్టామని వివరించారు. ఇప్పటి వరకు 280 దేవాలయల్లో ప్రవచనం పూర్తి చేశామన్నారు. తొలుత స్వామి వారిని దర్శించుకుని నాగపుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాల బ్రహ్మానంద సరస్వతిని ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు సత్కరించారు.

ద్విచక్ర వాహనాల చోరీ కేసులో నిందితుడికి జైలు

బంటుమిల్లి: సుమారు ఐదు నెలల కిందట పోలీసులు అరెస్ట్ చేసి రికవరీ చేసిన ద్విచక్ర వాహనాల కేసులో నిందితుల్లో ఒకరికి నాలుగు నెలల జైలు, రూ. 200 జరిమానా, మరో ముగ్గురికి రూ వెయ్యి చొప్పున జరిమానాను బంటుమిల్లి సీనియర్ సివిల్ జడ్జి ఈ. సుధాకర్ విధించారని ఎస్ఐ ఎ. పైడిబాబు తెలిపారు. అవనిగడ్డ మండలం వేకనూరు గ్రామానికి చెందిన తుంగల శ్రీనివాస రామానుజన్ కృత్తివెన్ను మండలం, చినపాండ్రాక గ్రామానికి చెందిన మోటారుసైకిల్ మెకానిక్‌లు ముత్యాల అశోక్, పుప్పాల పండు, పడవల అరుణ కుమార్‌లతో కలిసి బంటుమిల్లి, కృత్తివెన్ను ప్రాంతాల్లో 27 ద్విచక్ర వాహనాలు అమ్మారు. వీరిపై ఈ ఏడాది జూలై 7న కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. నిందితులపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శ్రీనివాస రామానుజన్‌కు జైలు, జరిమానా, మిగిలిన ముగ్గురికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించారు.

సోమేశ్వరస్వామికి సూక్త అభిషేకం

కోనేరుసెంటర్: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని ఎస్ఎన్ గొల్లపాలెంలోని ఉమా సమేత సోమేశ్వరస్వామికి గురువారం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారికి పూజలు జరిపించారు. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

కోడూరు రహదారి నిర్మాణానికి సీఎం జగన్ హామీ

కోడూరు: ప్రజలకు ప్రాణసంకటంగా మారిన కోడూరు-అవనిగడ్డ ప్రధాన రహదారి పరిస్థితి గురించి బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. బుధవారం కోడూరులో జరిగిన మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ శంకుస్థాపనలో స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుతో కలిసి బాలశౌరి పాల్గొన్నారు. అవనిగడ్డ నుంచి కోడూరు వరకు 13 కిలోమీటర్ల రహదారి పూర్తి అధ్వానంగా మారింది. ఈ రహదారిపై ప్రయాణించిన బాలశౌరి స్వయంగా తన సెల్‌ఫోన్‌లో కోడూరు రోడ్డు దుస్థితిని చిత్రీకరించారు. బుధవారం సాయంత్రం తాడేపల్లిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన బాలశౌరి కోడూరు రహదారి దుస్థితిని వివరించడంతో పాటు వీడియోను చూపించారు. గత ఏడాది అవనిగడ్డ నియోజకవర్గంలో పర్యటించిన సమయంలో కోడూరు రహదారిని నిర్మిస్తామని సీఎం ఇచ్చిన హామీని గుర్తు చేశారు. రహదారి నిర్మాణంపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని, త్వరలోనే రహదారి నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని బాలశౌరి తెలిపారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

బంటుమిల్లి: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మల్లంపూడి, చోరంపూడి గ్రామాల్లో శుక్రవారం జరుగుతుందని అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తిరుమాని శ్రీనివాసరావు తెలిపారు. మల్లంపూడిలో ఉదయం 9.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, మధ్యాహ్నం చోరంపూడిలో జరుగుతుందన్నారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు.

రహదారి పనులకు శంకుస్థాపన



అవనిగడ్డ: మూడో వార్డులో రూ.4.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రహదారికి ఎంపీపీ తుంగల సుమతీదేవి గురువారం శంకుస్థాపన చేశారు. కోటగిరి వెంకటేశ్వరరావు ఇంటి నుంచి ఆళ్ల సీతమ్మ ఇంటి వరకు ఈ రహదారిని నిర్మించనున్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గాజుల జైగోపాల్, మండల కో-ఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్‌బాషా, వైఎస్సార్ సీపీ నాయకులు అన్నపరెడ్డి రాందాస్, గాజుల పోతురాజు, చిల్లర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సారా విక్రేతల అరెస్ట్

కోనేరుసెంటర్: బందరు సబ్ డివిజన్ పరిధిలోని పలు మండలాల్లో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బంది గురువారం సారా స్థావరాలపై దాడులు చేశారు. జిల్లా సెబ్ అధికారి ఆదేశాల మేరకు నిర్వహించిన దాడుల్లో గూడురు మండలం కప్పలదొడ్డి గ్రామానికి చెందిన అడపా ఉమా సరస్వతి నుంచి లీటరు సారాను స్వాధీనం చేసుకున్నారు. కట్టా నాగమల్లేశ్వరి నుంచి మరో లీటరు స్వాధీనం చేసుకున్నారు. గుడ్లవల్లేరు మండలం మండవాని పాలెంకు చెందిన మెండు ధనుంజయను సెబ్ దాడుల్లో పారిపోగా పట్టుకుని పై ముగ్గురిని కోర్టుకు హాజరుపరిచామని సెబ్ సీఐ అశోక్ తెలిపారు. అలాగే మరో 18 మంది సారా విక్రేతలను అదుపులోకి తీసుకుని పెడన తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు.

కార్తిక మాస ప్రవచనం

మచిలీపట్నంటౌన్: తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మప్రచార పరిషత్ మండలి మనగుడి కార్యక్రమంలో భాగంగా గురువారం ఈడేపల్లి జోడుగుళ్లలో నిర్వహించిన కార్తిక మాస ప్రవచన కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. బ్రహ్మశ్రీ జోష్యుల వేణు మాధవ్ కార్తిక మాస ధర్మాచరణ, అజామిళోపాఖ్యానం అంశంపై ప్రవచనం చేశారు. అనంతరం ఎం. లక్ష్మీకాంతం ఆధ్వర్యంలో సౌందర్య లహరి పారాయణ, శివానంద లహరి పారాయణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ తిక్కిశెట్టి వీరవెంకట మోహనరావు పర్యవేక్షించారు.

దివిసీమలో కుండపోత వర్షం



అవనిగడ్డ: దివిసీమలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. 3 నుంచి 5 గంటల వరకు కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. అవనిగడ్డలోని ప్రధాన రహదారి వర్షం నీటితో నిండిపోయింది. వర్షానికి పలు చోట్ల వరి పొలాలు పడిపోయాయి. వరి పంట కోతలకు వచ్చిన తరుణంలో కురిసిన భారీ వర్షం వల్ల పంటకు నష్టం వాటిల్లుతుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.